క్లుప్తంగా

లోక క్షేమం కోసం వరుణ హోమం



హోమం నిర్వహిస్తున్న ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి

రామచంద్రాపురం: సకాలంలో వర్షాలు పడి ప్రజలందరూ పాడి పంటలతో సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షతో వరుణ హోమం నిర్వహిస్తున్నట్లు ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి అన్నారు. శనివారం మండలంలోని సూరావారిపల్లిలోని సురభి గో సంరక్షణ శాలలో వరుణ హోమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన శివలింగానికి భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం చేపట్టారు.

చేనేత, హస్తకళా మేళా ప్రారంభం



చేనేత, హస్తకళా మేళా స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు

తిరుపతి కల్చరల్: సంస్కృతి కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో కరకంబాడి రోడ్డులోని వీఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా మేళాను శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు పైడి మహేష్ మాట్లాడుతూ శనివారం ప్రారంభమైన ఈ చేనేత, హస్తకళా మేళా జూన్ 1వ తేదీ వరకు 15 రోజులపాటు ఉంటుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాలకు చెందిన 35 మంది కళాకారులు తమ ఉత్పత్తులను విక్రయిస్తారని తెలిపారు. జైపూర్ బెడ్‌షీట్స్, గృహాలంకరణ వస్తువులు, కలంకారీ చీరలు, బెంగాలీ కాటన్, కాంత వర్క్ చీరలు, భాగల్పూర్ డ్రెస్ మెటీరియల్స్ అండ్ శారీలు, మన రాష్ట్రానికి చెందిన కొండపల్లి బొమ్మలు, కడపకు చెందిన చేనేత టవల్స్, ఖాదీ షర్ట్స్, ఖాదీ టాప్స్ తదితర వస్త్రాలు సరసమైన ధరల్లో లభిస్తాయని తెలిపారు.

ఘనంగా సంగీత నృత్యోత్సవం



మాట్లాడుతున్న పోకల అశోక్‌కుమార్

తిరుపతి కల్చరల్: అన్నమయ్య జయంతోత్సవాలను పురస్కరించుకొని కదిరి వెంకటరమణరావు ఆధ్వర్యంలో శనివారం మహతి కళాక్షేత్రంలో అన్నమయ్య సంగీత, నృత్యోత్సవాలు అత్యంత వేడుకగా నిర్వహించారు. ఉదయం ఆరంభమైన ఈ కార్యక్రమానికి టీటీడీ రిటైర్డ్ డెప్యూటీ ఈఓ చిన్నంగారి రమణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి 150 మంది కళాకారులు పాల్గొని అన్నమయ్య సంకీర్తనలకు చక్కటి హావ భావాలతో నృత్యాభినయం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం రాత్రి నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథి టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్ మాట్లాడుతూ నిర్వాహకుడు వెంకటరమణరావు కళాకారులను ఒక వేదిక పైకి తీసుకొచ్చి కళావికాసానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మరో అతిథి అన్నమయ్య వంశీకుడు హరినారాయణాచార్యులు మాట్లాడుతూ అన్నమయ్య భక్తి సంకీర్తనలకు నృత్యాన్ని మిళితం చేసి అన్నమయ్య సంగీత, నృత్యోత్సవాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం 13 మంది నాట్య గురువులను అతిథులు, నిర్వాహకులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. లలితకుమారి, ఇరముని శేఖర్ పాల్గొన్నారు.

అమ్మ 'దొర'తనం!



వెయ్యి కళ్ల కుండలతో ప్రదక్షిణలు



సెల్ఫీ తీసుకుంటూ...



కళాకారుడి విన్యాసం



తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్న మంత్రి ఆర్‌కే రోజా

- తిరుపతి గంగజాతరలో భక్తుల సందడి
- దొర వేషధారణతో మొక్కులు చెల్లించిన భక్తులు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ గంగజాతర అంగరంగ వైభవంగా సాగుతోంది. ఇందులో భాగంగా నాలుగో రోజు శనివారం భక్తులు దొర వేషధారణలో సందడి చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు గంగబొట్లు పెట్టుకొని, వేపాకు నడుముకు కట్టుకొని ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు జానపద వేషధారణలు, దేవతామూర్తుల వేషాలతో ఆకట్టుకున్నారు. మరికొందరు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకొని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సంప్రదాయ బద్ధంగా ఆలయం తరఫున కైకాల కులస్థులు దొరవేషం, చాకలి కులస్థులు మంత్రి వేషం ధరించి నగరంలోని వీధులలో తిరుగుతూ ప్రతి ఇంటా పూజలు అందుకున్నారు.

నేడు మాతంగి వేషం

శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా ఐదో రోజు ఆదివారం తెల్లవారుజాము నుంచి మాతంగి వేషాన్ని గుడి తరఫున మిరాశీదార్లు, మొక్కుబడి ఉన్న స్థానికులు వేయడం ఆనవాయితీ. మిరాశీదార్లు వేసే మాతంగి వేషంలో కైకాల కులస్థుడొక్కరే పాల్గొంటారు.









ముద్దుగారే చిన్నారుల వేషధారణ

వేడుకగా గంగమ్మకు తిరుమల వెంకన్న సారె



శ్రీవారి సారె తీసుకొస్తున్న ఈఓ కె.మమత

తిరుపతి కల్చరల్: శ్రీవేంకటేశ్వరస్వామి చెల్లెలిగా భక్తకోటి పూజలందుకుంటున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మకు వేడుకగా తిరుమల శ్రీవారి సారె శనివారం సమర్పించారు. గంగమ్మ జాతర ప్రారంభమైన నాలుగో రోజు శ్రీవారి నుంచి సారె సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు, అధికారులు సారెను శ్రీగోవిందరాజ స్వామి ఆలయానికి తీసుకొచ్చారు. శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈఓ లోకనాథం ఆధ్వర్యంలో నిర్వహించారు. లోకనాథం సారెను నెత్తిన పెట్టుకొని గంగమ్మ ఆలయ ఈఓ కె.మమతకు అందజేశారు. సారె శోభాయాత్ర శ్రీగోవిందరాజస్వామి ఆలయం నుంచి కర్నాల వీధి, భేరి వీధి, కృష్ణాపురం ఠాణా, నాలుగు కాళ్ల మండపం, పెద్దకాపు లేఔట్ ద్వారా గంగమ్మ ఆలయం వరకు సాగింది. గంగమ్మ ఆలయానికి చేరుకున్న వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అధికారులు జేఈఓకు తీర్థప్రసాదాలు అందజేశారు.



మనుషులపై దాడి మా సంస్కృతి కాదు

- నానిపై కాదు ఆయన కారుపై మాత్రమే దాడి
- పక్కగానే వెళ్లాడు.. అయినా పట్టించుకోలేదు
- కళ్ల ముందే ఉన్నాడు.. అయినా ఏమీ చేయలేదు
- ఎమ్మెల్యే చెవిరెడ్డిపై దాడి, మోహిత్ కార్లను కాల్చివేశారనే కారుపై దాడి చేశాం
- భానుపైనే దాడి చేశారు
- ఆత్మరక్షణలో భాగంగా గన్‌మన్‌కు గాయం
- కడప జైలులో ఉన్న భాను మాటలను వెల్లడించిన ఆయన భార్య ఢిల్లీరాణి
- వర్సిటీ ముందు ఎలాంటి ఇబ్బంది లేని నాని.. సానుభూతి కోసమే ఆసుపత్రి ఎపిసోడ్
- అమాయకులను అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారు
- అధికారులు, ప్రజలు అంతాగమనిస్తున్నారు
- పద్మావతి వర్సిటీ ఘటనలో అక్రమ కేసుల బాధితుల కుటుంబ సభ్యుల ఆవేదన



మాట్లాడుతున్న ఆర్‌సీపురం జెడ్పీటీసీ సభ్యురాలు ఢిల్లీరాణి, అక్రమ కేసుల బాధితుల కుటుంబసభ్యులు

తిరుపతి రూరల్: 'మనుషులపై దాడి మా సంస్కృతి కాదు.. పులివర్తి నానిపై వ్యక్తిగత కక్ష లేదు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కారుపై దాడి.. మోహిత్‌రెడ్డి కారును కాల్చి వేయడం, సర్పంచ్ ఇంటిని తగలబెట్టడం.. రాజకీయ కక్షతో రెడ్లను భయపెట్టాలని చూస్తున్నారు. అందుకనే నాని కారుపై మాత్రమే దాడిచేశాం. ఆయనను చంపాలని అనుకుంటే కారుపై దాడి తర్వాత మా పక్కనుంచే ఆయన వెళ్లాడు. మేం పట్టించుకోలేదు. కళ్ల ముందే ఉన్నాడు.. అయినా ఏమీ చేయలేదు. కేవలం కారుపై మాత్రమే దాడిచేశాం, ఆత్మరక్షణలో భాగంగా తప్పించుకునే క్రమంలో గన్‌మన్‌కు గాయం అయింది' అని కడప సెంట్రల్ జైలులో ఉన్న తన భర్త భాను స్పష్టం చేసినట్లు రామచంద్రాపురం జెడ్పీటీసీ ఢిల్లీరాణి తెలిపారు. తిరుపతి రూరల్ మండలంలోని ఓ ప్రైవేటు హోటల్లో శనివారం పద్మావతి మహిళా వర్సిటీ ఘటనలో అరెస్ట్ అయిన వారి కుటుంబ సభ్యులతో కలసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయ అలజడులను ప్రేరేపిస్తున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసు అన్నారు. రెచ్చగొట్టే క్రమంలోనే నామినేషన్ రోజు ఆర్‌ఓ కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కారుపై రాళ్లు, కర్రలు, ఆయుధాలతో దాడి చేశారని గుర్తు చేశారు. గొడవలు వద్దు... ప్రశాంత చంద్రగిరి ముద్దు అనే నినాదంతోనే గత ఐదేళ్లపాటు పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పనులను చేపట్టారన్నారు. ఎలాంటి దాడి జరగక పోయినా, చిన్న గాయం కూడా కాకుండా, కనీసం షర్టు కూడా నలగకుండానే రెండు గంటలపాటు వందలాది జనాల మధ్య నాని ఉన్నారని, ఎక్కడా ఇబ్బంది పడినట్లు వీడియోల్లో కనిపించలేదని గుర్తు చేశారు. అయితే సానుభూతి కోసమే ఆసుపత్రి ఎపిసోడ్ నడిపించారని, దాడికి గురైనట్లు ఎలాంటి ఆధారాలు లేకపోయినా తీవ్ర అనారోగ్యం అంటూ చేసిన హంగామా ప్రజలు, అధికారులు గమనించాలని కోరారు. ఆ మేరకు పలు వీడియోలను మీడియాకు అందించారు.

ఐదుగురు వస్తే... 150 మందిపై కక్ష

నాని కారుపై దాడి చేసేందుకు చిన్న కారులో కేవలం ఐదుగురు మాత్రమే పద్మావతి వర్సిటీకి వచ్చారని, వీడియోల్లో కూడా అది స్పష్టంగా కనిపించినట్లు జెడ్పీటీసీ ఢిల్లీరాణి తెలిపారు. కేవలం ఐదుగురు వచ్చి దాడి చేస్తే 150 మంది వచ్చి దాడి చేసినట్లు అమాయకులపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. ఆత్మరక్షణలో భాగంగా పారిపోయే క్రమంలోనే గన్‌మన్‌కు గాయం అయినట్లు భాను వివరించారని ఢిల్లీరాణి చెప్పారు. చిన్న ఘటనను ఎల్లో మీడియాలో పెద్ద సంఘటనగా చిత్రీకరించి అమాయకులను వేధించాలనే ప్రయత్నాలను మానుకోవాలని పద్మావతి వర్సిటీ ఘటనలో అక్రమ కేసుల బాధితుల కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. కేసుతో సంబంధం లేని, కనీసం ఆ ప్రాంతంలో లేని విద్యార్థులు, ఉద్యోగులను సైతం అక్రమ కేసులో ఇరికిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షతో పెడుతున్న ఈ కేసులు, వేధింపులపై సిట్ బృందాన్ని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

వైఎస్‌ఆర్ సీపీ నేత హరికృష్ణారెడ్డి మృతి



నివాళులర్పిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

పాకాల: సామిరెడ్డిపల్లికి చెందిన వైఎస్‌ఆర్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు హరికృష్ణారెడ్డి(55) శనివారం వేకువజామున ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, తనయుడు, తుడా చైర్మన్, వైఎస్‌ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సామిరెడ్డిపల్లికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరికృష్ణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు. మృతుడు హరికృష్ణారెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, అన్ని సమయాల్లో అండగా ఉంటామని భరోసా కల్పించారు. మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి కూడా హరికృష్ణారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వైభవంగా బలిబండి

భాకరాపేట: యడమవారిపల్లె మహా భారత ఉత్సవాల్లో భాగంగా బలిబండి కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. శనివారం మహా భారత ఉత్సవంలో బకాసుర వధ పగటి కథ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి బకాసురుడికు భీముడు పిండి వంటలు, అన్నం, మాంసం తీసుకెళ్లే ఘట్టం జరిగింది. దీంతో గ్రామ ప్రజలు భీముడు వేషధారి బలి బండి తీసుకుని గ్రామంలోకి రాగా గ్రామ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పిండి వంటలు, అన్నం వండి బలిబండిలో సాగనంపారు.

దేవరకొండపై విశేష పూజలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండపై వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం స్వామి వారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేసి విశేష అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్తలు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్సీ సిపాయి



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

సీఓసీ నిర్మాణ పనులను వేగవంతం చేయండి

తిరుపతి తుడా: తిరుపతి పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం స్థానంలో నూతనంగా నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ కాంట్రాక్టర్లకు, ఏఈకామ్ ప్రతినిధులకు, ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నూతన కార్పొరేషన్ భవన నిర్మాణ పనులను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, ఏఈకామ్ ప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనులు వేగవంతం చేసి భవన నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఈ భవనం పూర్తి అయితే మున్సిపల్ కార్పొరేషన్‌కి నూతన కార్యాలయం రావడమే కాకుండా, కమాండ్ కంట్రోల్ సేవలు కూడా ప్రజలకి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పనులు ఆలస్యంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇకపై ఎప్పటికప్పుడు నిర్మాణ పనుల వివరాలను తనకు తెలియజేస్తూ పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇకపై పనులు ఆలస్యమయితే తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్లు, డీఈ విజయకుమార్ రెడ్డి, ఏయికామ్ ప్రతినిధి అనిల్ పాల్గొన్నారు.

శెట్టిపల్లి చెరువులో అక్రమ నిర్మాణాలు



శెట్టిపల్లి చెరువులో ఆక్రమణలు

తిరుపతి మంగళం: తిరుపతి అర్బన్ పరిధిలోని శెట్టిపల్లి చెరువులో శనివారం కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. చెరువులు, కాలువలు, రోడ్డు పోరంబోకు స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఏకంగా చెరువులో ఎలా నిర్మాణాలు చేపడుతారని ఆక్రమణదారులను ప్రశ్నించారు. అయితే తమకు పట్టాలు ఉన్నాయని, దాంతో నిర్మాణం చేపడుతున్నామని నిర్మాణదారులు చెప్పారు. చెరువులో ఎలా పట్టాలు ఉన్నాయని, ఏమైనా పట్టాలు ఉంటే వాటిని రెవెన్యూ కార్యాలయానికి తీసుకొచ్చి తహశీల్దార్‌కు చూపించాలన్నారు. అలా కాకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణదారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.



బహిరంగ ప్రకటన

1) ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడం ఏమనగా తిరుపతికి చెందిన ఎన్. నరసింహా రెడ్డి, తండ్రి మునిరెడ్డి గారికి మైసూరు నందు శ్రీ పరకాల మఠము వారికి జరిగిన వాజ్యము ఓ.ఎస్.నెం. 455/2004 డిగ్రీకి మైసూరు జిల్లా కోర్టు నందు ఆర్.ఎ. 593/2016 అపీలు వేసియున్నారు. సదరు అపీలు పై సుధీర్ఘ విచారణ అనంతరము అప్పిలేట్ కోర్టు వారు తేది. 6.4.2024 న ఎన్. నరసింహా రెడ్డి గారికి అనుకూలముగా తీర్పును ఇచ్చియున్నారు.

2) 30. 11. 1988 తేదీన శ్రీ పరకాల మఠాధిపతి వారు (మైసూరు) తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామం సర్వేనం. 145, 147, 148/2 లో వారికి గల 1/4 వాట ఎకరములు 17. 12 1/2 సెంట్ల భూమిని అమ్ము కొనుటకు GPA పొందియున్నారు. పై జరిగిన దావాలో శ్రీ నరసింహ రెడ్డి గారికి శ్రీ పరకాల మఠాధిపతి వారు fraud మరియు MisRepresentation చేసి సదరు జి.పి.ఎ.ను పొందినట్లు సరియైన సాక్షా ఆధారాలతో సదరు శ్రీ పరకాల మఠాధిపతివారు నిరూపించ లేకపోయారని తీర్పు ఇచ్చియున్నారు. సదరు జి.పి.ఎ. (Irrevocable) సక్రమమైనదని తెలిపినారు.

3) శ్రీ పరకాల మఠాధిపతివారు నరసింహారెడ్డి గారికి ఇచ్చిన GPA ద్వారా భూములు అమ్ముకొనుటకు ఉద్దేశించబడినవనియు సదరు Irrevocable GPAను సదరు శ్రీ పరకాల మఠాదిపతి వారు వేసిన వాజ్యములో OS No 455/2004, తేది 20.04.2016 ఇచ్చిన తీర్పును రద్దు పరచి సదరు వాజ్యమును డిస్‌మిస్ చేసినారు.

4) కావున ఎ. నరసింహ రెడ్డి గారికి, వారు జరిపిన లావాదేవీలు అధికారకమైనవని నిర్ధారించడమైనది సదరు శ్రీ పరకాల మఠాధిపతి వారు, నరసింహా రెడ్డి గారి GPA ను సక్రమముగా రద్దుచేయకుండా M.K. నాయుడు, M.K. చక్రధర్ చౌదరి మరియు వారి కుటుంబసభ్యులకు జరిపిన లావాదేవిలు ఏదియును చెల్లదు. ఈ భూముల పై పూర్తి హక్కు శ్రీ నరసింహా రెడ్డిగారికి అధికారము నిర్ధారణ అయినందువలన ఆభూములపై పరకాల మఠము వారు లేక M.K. నాయుడు కుటుంబసభ్యులు ఇతరత్ర ఎలాంటి లావాదేవీలు జరిపిన మేము తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు అవుతారని తెలియచేయడమైనది.

ఎన్.నరసింహా రెడ్డి డి.నెం.19-7-79హెచ్3, గోపాలరాజు కాలనీ, తిరుపతి	పి. సేతుమాధవ్,అడ్వకేట్, 9-505,లింగేశ్వర్ నగర్, తిరుపతి, సెల్:9676580509

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ తిరుపతి జిల్లా, రామచంద్రాపురం మండలం, పి.వి.పురం గ్రామ వాస్తవ్యులు కె.బాలక్రిష్ణారెడ్డి కుమారుడు కె.నాగిరెడ్డి వారి తరఫున యావన్మందికి తెలియజేయడమేమనగా!

నా కక్షిదారుడు కె.నాగిరెడ్డి 4వ అదనపు జిల్లా జడ్జి, తిరుపతి కోర్టు నందు ముడింబి కాశీ శేషాద్రి S/o ఎం.శ్రీష్ణమాచార్యాలు గారిపైన Specific Performance Suit క్రింద జరిగిన షెడ్యూల్ దావాలాపై వేసియున్నారు. సదరు షెడ్యూల్ ఆస్తులపై పైన కరిగిన కోర్టు వారు ఎవరికి అన్యాక్రాంతం చేయకూడదని I.A.No. 1 of 2021 in OS No. 74 of 2021 లో ఇంజంక్షన్ ఆర్డరు ఇచ్చియున్నారు. కానీ పైన తెలిపిన ముడింబి కాశీ శేషాద్రి మరియు ఆయన కుమార్తె ఐ.సుజాత కలిసి వేరే ఇతరులకు అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నించుచున్నారని జాడిగా తెలిసినది. సదరు ముడింబి కాశీ శేషాద్రి గారి దగ్గర నుండి ఎవరైనను ఎలాంటి క్రయ, విక్రయ అగ్రిమెంట్‌లు, అదమాన తనఖాలు చేసిన అట్టివి చట్టరీత్యా ఎంతమాత్రము చెల్లనేరవు. అట్టివాళ్లపై నా క్లయింట్ తీసుకొను సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని హెచ్చరించడమైనది.

షెడ్యూలు

1st item:
Chittoor district - Sri Balaji registration district - Tirupati sub-district - Tirupati urban mandal - Tirupati - 02 previously in Muthyalareddi Palli Panchayath area - now in Tirupati town and Municipal corporation ward No.23 in Vaikuntapuram area - survey No.285/8 - plot No.B1 - Door No.23-3-17 R.C.C. house bounded on East : D.No.3-18 belonged to A.R.Durga Devi; West : Road; North: D.No.3-16 belonged to V.Nagarjuna Reddy; South; road;
within these boundaries East to west northern side 41.3 feet or 12.581 mts. East to west southern side 40.5 feet or 12.352 mts. North to south both sides 54 feet or 16.470 mts. total 2207.25 square feet or 245.25 square yards vacant site in which house measuring East to west 26 feet; North to south 31 feet; total 806 square feet RCC house with all doors, door frames, windows, Panchayath tap connection one HP motor, electricity meter, electricity service connection bearing No.472 with all appurtenances to the said house.
2nd item:
In Chittoor district - Sri Balaji registration district, Tirupati rural sub- district - Ramachandra Puram mandal - Prasanna Venkateswara Puram village accounts - survey No.158/4 an extent of Ac.0.29 cents - survey No.158/5 an extent of Ac.0.80 cents in total Acs.1.09 cents bounded on East: Land of Eddala Srinivasulu Reddy; West: Land of Eddala Srinivasulu Reddy; North: land of Late Veperi Ramachandra Reddy; South: land of Eddala Srinivasulu Reddy, Veperi Sudhakar Reddy;
within these boundaries Acs.1.09 cents of land fully.

తిరుమలశెట్టి నాగభూషణం, తిరుమలశెట్టి చైతన్యకృష్ణ
న్యాయవాదులు, తిరుపతి.
సెల్: 9246999101, 7993102101, 9492739101

ముత్యపు పందిరిపై గోవిందుని కటాక్షం



ముత్యపు పందిరి వాహనంపై కొలువై ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తున్న శ్రీగోవిందరాజ స్వామివారు



సింహ వాహనంపై ఊరేగుతూ దర్శనమిస్తున్న శ్రీఅనంత తేజోమూర్తి

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం రాత్రి స్వామివారు ముత్యపు పందిరి వాహనంపై కొలువై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. రాత్రి 7 గంటలకు స్వామివారి వాహన సేవ ప్రారంభమైంది. వాహనం ముందు వృషభాలు, అశ్వాలు, గజరాజులు నడుస్తుండగా, కళాకారులు వివిధ దేవతామూర్తుల వేషధారణలో సందడి చేస్తూ భక్తులను అలరింపజేశారు. అలాగే భక్తబృందాలు స్వామివారిని కీర్తిస్తూ భజనలు, కళా ప్రదర్శనలు చేస్తూ భక్తి పారవశ్యాన్ని చాటాయి. మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి వాహన సేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు పలికి స్వామి వారిని దర్శించుకున్నారు. దీనికి ముందు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి సింహ వాహన సేవ వేడుకగా సాగింది. వాహన సేవలో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో వేడుకగా సాగింది. అనంతరం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, చందనాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఎఫ్ఏ అండ్ సీఏఓ బాలాజీ, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఆగమ సలహాదారులు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, సూపరింటెండెంట్ మోహనరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.




వాహన సేవలో కళాకారుల ప్రదర్శన

వైభవంగా బ్రహ్మంగారి రథోత్సవం



తిరుపతిలో బ్రహ్మంగారి రథోత్సవం



పాకాల: పుష్పపల్లకిపై వీరబ్రహ్మేంద్రస్వామి

తిరుపతి కల్చరల్: తిరుపతి అన్నారావు సర్కిల్ సమీపంలో వెలసి ఉన్న శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఆరాధనోత్సవాల్లో భాగంగా రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. శనివారం వీరబ్రహ్మేంద్రస్వామి జీవసమాధి అయిన రోజు సందర్భంగా ఉదయం విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి శ్రీగోవిందమాంబ, బ్రహ్మంగారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా సాగింది. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

పాకాల: భారతంమిట్టలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామివారి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం వీరబ్రహ్మేంద్రస్వామి జీవసమాధి అయిన రోజు సందర్భంగా విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం 4.30 గంటలకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ వారి హరికథా కాలక్షేపం, అనంతరం ఆలయంలో దీపారాధన కార్యక్రమాలు చేపట్టారు.